**1976 నల సంవత్సర ఉగాది కథానికల పోటీలో చతుర్థ బహుమతి రు. 200 పొందిన కథ**

# మైలు రాళ్ళు

యన్.వి.యస్. లక్ష్మి

## ఇరవై ఒకటో రాయి దగ్గర...

"ఇరవై ఒక్క మైళ్ళు" అని తనే రాసిన ఆ అక్షరాల మీద తెల్ల పెయింట్ వేసి, నెం. టూ బ్రష్‌ని నల్ల పెయింట్‌లో ముంచి "కిలోమీటర్లు అని రాస్తుంటే తిరపతి కళ్ళల్లో మసక మసకగా కన్నీరు..........!

తన ఆశా సౌధాలూ, ఆకాశ హర్మ్యాలూ అన్నీ కూలిపోయ్యాయి. పడిన శ్రమంతా వ్యర్థమైపోయింది. కొండ ఎక్కుతుంటే ఆకాశాన్నంటుతున్న తన ఆశలు, ఆశయాలు మళ్ళీ కొండ దిగుతుంటే_ అవీ దిగడం మొదలుపెట్టి కొండ కింద అగాథాల్లో శిథిలమైపోయాయి. తను నిర్భాగ్యుడు. కేవలం, ఒక నిర్భాగ్యపు శిల్పిగా, ఆ శిథిలాలయం ముందు నిల్చిపోయాడు.

ఆలోచిస్తున్నాడు. ఒక్కో మైలు రాయినీ దిద్దుతూ క్రింద కెళ్తున్నాడు...

చిన్న పొరపాటు తన జీవితంమీద దెబ్బకొట్టింది. అగాధాల్లోకి కూల్చేసింది.

జీవితంలో ఒక్కో మెట్టే పై కెక్కాలని ఆశిస్తాడు. మనిషి.

కాని తను ?

ఒక్కోమెట్టే దిగిపోతున్నాడు. జారిపోతున్నాడు. ఇందులో తప్పెవరిది ? తనదేనా ? మున్సిపాలిటీ కనదేనా ?

ఏమో ! ఏమో !

ఆలోచిస్తున్నాడు.... ఒక్కో మైలు రాయినీ దిద్దుతూ క్రింద కెళ్తున్నాడు.

*　　*　　*

కంట్రాక్టరు శివానందం ఇంటి గుమ్మం ముందు తిరపతి అతని రాక కోసం రెండు గంటల్నుంచీ ఎదురు చూస్తున్నాడు.

"ఈ కంట్రాక్టరు ఎంతకీ రాడు .... లోపల ఏం చేస్తున్నాడో ఏమో? మొన్న వస్తే ఇవాళ ఎనిమిది గంటలకి రమ్మన్నాడు....పదిగంటలయింది. ఐనా దర్శనంలేదు.... అవును. ఒంటి నిండా గర్వం, ఇనప్పెట్టె నిండా డబ్బూ ఉండిగా మరి! "..... ....." ఛ! ఇదేమిటి? తనిలా ఆలోచిస్తున్నాడు? ఆయన్ని తిట్టుకోవట మెందుకు? ఆయనిప్పుడేదైనా పనిచూపకపోతే ఏమైపోతాడుతను?"

"ఏమో? డబ్బున్నవాడు .... ఆయనకెన్ని పన్లుంటాయో? తనలాంటి వాళ్ల లక్షా తొంభై మంది పనిప్పించమనివస్తారు. అందుకనాలిస్యం అయ్యుండొచ్చు....

"ఈ కంట్రాక్టరు కాళ్ళు పట్టుకునైనా సరే. ఎన్. ఎమ్. ఆర్. కూలీగా చేరాలి. డబ్బు సంపాదించాలి. లేకపోతే ఇల్లెలా గడుస్తుంది ? కూలి చెయ్యకపోతే అమ్మా. తనూ తిండికికూడా లేక చస్తుండాలి. తన బ్రతుకంతా ఈయన దయాధర్మం మీద ఆధారపడి ఉంది."

మనసులో వచ్చిన ఆవేశాన్ని పారద్రోలాడు

కంట్రాక్టర్ శివానందం బయటికి వచ్చాడు. తిరపతి నమస్కారాలందుకుంటూ; తీరిగ్గా పడక్కుర్చీలో వాల్తూ తిరపతికేసి పరకాయించి చూశాడు. చామన చాయ రంగులో బక్కపలుచగా. అమాయకంగా కన్పించాడు. కళ్ళల్లో ఏదో ఆశ.. ఆ అమాయకమైన మొహం లోనే ఏదో సాధించాలనే పట్టుదల....

"సరే! అయితే కూలిపని చేస్తానంటావు

చదువు మానేసి."

"అవును సార్! మీరు దయ చూపించాలి. నా పరిస్థితులు చెప్పుకున్నానుగా? ఇన్నాళ్ళూ అమ్మ నన్ను కష్టపడి చదివించింది. తను మంచం ఎక్కాక నా చదువాగిపోయింది సార్! నేను సంపాదించక పోతే మాకు తిండికే గడవదు. మీ కాళ్ళు పట్టుకుంటాను. నాకు పనిప్పించండి సార్!" తల, "కిందికి దించుకుని" అన్నాడు తిరపతి.

"ఇంత నీరసంగా ఉన్నావే. మరి బరువు పన్లేవైనా చైగలవా అని...."

"ప్రస్తుతం నేను కంట్రాక్టుకి తీసుకున్న ఈ ఘాట్ రోడ్ పూర్తయింది. ఇంక మైలు రాళ్ళకి తెల్లరంగేసి, వాటిమీద నల్ల రంగుతో అంకెలెయ్యాలి. నువ్వు ఎంత రాత్రయినా ఇవాళ ఆ పని పూర్తి చెయ్యాలి. ఆ పనే మిగిలిపోయింది. రేపు సాయంకాలం అయిదింటికి ముఖ్య మంత్రిగారొచ్చి ప్రారంభోత్సవం చేస్తారు. ఏం? చెయ్యగలవా ?" అన్నాడు శివానందం.

"అబ్బ ! మైలు రాళ్ళకి రంగు వెయ్యడం ! ఎంత చక్కటి పని !" సంతోషంతో పొంగిపోతూ శివానందానికి దణ్ణాలు పెట్టాడు తిరపతి.

* * *

అలిపిరి దగ్గర మెట్ల ముందర నుంచుని పైనున్న గాలి గోపురం కేసి చూశాడు తిరపతి. పెయింట్ డబ్బాలు పక్కన పెట్టి, సాష్టాంగపడివున్న హనుమంతుడి విగ్రహం దగ్గర తనూ సాష్టాంగపడి తిరుపతి వెంకటేశ్వరుడ్ని ప్రార్థించాడు. హనుమంతుడికి మొక్కి రెండవ రోడ్డులో మొదటి రాయి దగ్గరకెళ్ళాడు.

కుంచెని తెల్ల రంగులో ముంచి ఆ రాయి మీద అన్నగానే ఏదో చెప్పలేని ఆనందం.. ఏవేవో ఊహలు....ఆకాశ హర్మ్యాలు....

* * *

ఆ మర్నాడు సాయంకాలం అయిదింటికి..

రోడ్డు మొదట రెండు స్తంభాలకి కట్టిన పొడుగాటి రిబ్బన్ని ముఖ్యమంత్రిగారు సుతారంగా కత్తిరించారు. చుట్టూ ఉన్న ఇంజనీర్లూ, కంట్రాక్టరు శివానందం, విలేకర్లు చూడ్డానికి వచ్చిన జనం ....అంతా చప్పట్లు కొట్టారు. ఫ్లాష్ కెమెరాలు క్లిక్ మన్నాయి.

మంత్రిగారు చిరునవ్వుతో అందరికీ నమస్కరించి వెళ్ళి తన కార్లో కూచున్నారు. ఆయన కారు ముందర...ఆ వెనక మిగిలిన కార్లూ. జీపులూ....అన్నీ రోడ్డు మీద ఒకదాని వెనక ఒకటి.... వరసగా కదిలాయి.

తీరిగ్గా సీటు నానుకు కూచుని తిరుమల గిరుల సౌందర్యాన్నాస్వాదిస్తున్నారు మంత్రిగారు. రోడ్డుకు పక్కగా. మధ్య మధ్య తెల్లగా అందంగా రంగు వెయ్యబడ్డ మైలు రాళ్ళవంక, వాటిమీద ఇంకా అందంగా వేయబడిన అంకెల వంక చూశారు.

ఎవరో మామూలు కూలీ, అలవాటుగా నిర్లక్ష్యంగా రంగువేసినట్లు లేవవి. ఏ చిత్రకారుడో అందమైన చిత్రాన్ని పెయింట్ చేసినంత శ్రద్ధగా రంగువేశారెవరో వాటికి.

వాటి మీద నల్లని అంకెలతో, తెల్లగా తీవిగా, పచ్చని ప్రకృతి మధ్య, సిమెంటు రోడ్డు పక్క, ఎర్రని మట్టి మీద వింత అందంతో నిల్చి వున్నాయి. అలౌకిక సౌందర్యంతో మెరిసిపోతున్నాయి.

మంత్రిగారు ఆశ్చర్యపోయారు. "ఇంత అందంగా ఎవరు వేశారు.? ఇది మామూలు కూలీలు చేసిన పని కాదు, ఏ నిర్భాగ్యుడో గత్యంతరం లేక చదువు మాని.... కూలీగా చేరి ..."

కార్లన్నీ కొండ పైకి చేరుకున్నాయి. మంత్రిగారూ పరివేష్టిత బృందం కార్లలోంచి దిగారు.

మంత్రి గారు చీఫ్ ఇంజినీరు కేసి తిరిగారు. "చూడండి.... ఇంజినీరుగారూ! ఆ మైలురాళ్ళు ఎంత అందంగా శ్రద్ధగా పెయింట్ చేశారో! ఎవరు పెయింట్ చేశారు?"

ఆయన మైలు రాయి కేసి చూశారు. నిజమే! ఆ రాయి మామూలు మైలురాళ్ళ కంటె చాలా అందంగా, జాగ్రత్తగా పెయింట్ చెయ్యబడి ఉంది. యస్. ఇ. గారివంక చూశారు. ఆయన ఇ. ఇ. గారి వంకా, ఇ. ఇ. గారు ఎ. ఇ. వంకా, ఎ. ఇ. గారు కంట్రాక్టరు శివానందం వంకా... శివానందం మైలు రాయి వంక చూశాడు. "తిరపతి ఎంత చక్కగా చేశాడు? అద్భుతం! అద్భుతం!" అనుకున్నాడు.

"ఈ రాళ్ళని తిరపతనే కుర్రాడు పెయింట్ చేశాడండీ! ఫిఫ్త్‌ఫారం చదువుతూ మానేశాడు వాళ్ళమ్మకి ఒంట్లో బావోలేక. పనిప్పించమని ప్రాధేయపడితే నేనే...." చేతులు నలుపుకుంటూ మంత్రి గారితో అన్నాడు శివానందం.


కంట్రాక్టరు శివానందం అదనంగా మరో పాతిక రూపాయలు తిరపతి చేతిలో పెట్టాడు. "ఇంక ఎప్పుడూ నా దగ్గరే పని చెయ్యి" అంటూ.

తిరపతి మనసు సంతోషంతో పొంగింది.

* * *

మొదటి రాయికి తెల్ల రంగెయ్యడం పూర్తైంది. ఊహల్లోంచి వాస్తవంలో కొచ్చి, నెం. టూ బ్రష్ ని నల్ల డబ్బాలో ముంచి "ఒకటి అంకె వేసి ముందుక్కదిలాడు తిరపతి. అతన్తోటే అతని ఆలోచన్లూనూ.

"కంట్రాక్టరు శివానందం లాంటి ధనవంతుల్ని మెప్పించే పనికీ, డబ్బుకీ లోటుండదు. వచ్చిన డబ్బుని పొదుపుగా వాడి మిగుల్చుకోవాలి. కొన్నాళ్ళకి అమ్మకి



నయమౌతుంది. అప్పుడు అమ్మా, తనూ ఇద్దరూ పని చేసి సంపాదిస్తారు. పగలు రాత్రిళ్ళు చదువుతాడు. కష్టపడి పనిచేస్తూ ఫస్టుక్లాసులో పరీక్షల కెళ్ళాడు. తప్పకుండ పదో తరగతి పాసవుతాడు. స్కూల్లో చదివే టప్పుడూ ఫస్టుమార్కులేగా తనకి మరి!...



పరీక్షపాసయ్యాక శివానందం గారే జీతం పెంచిమరో పని చూపిస్తారు. అలా కొంత డబ్బు దాచుకొని, పని మానేసి, పాలిటెక్నిక్ కాలేజిలో చేరాలి.... పొద్దున్న, సాయంత్రం పిల్లలకి ప్రైవేట్లు చెప్తే ఇంకొంచెం మిగుల్చుకోవచ్చు. పాలిటెక్నిక్ ఫస్టు క్లాసులో పాసవ్వాలి. అప్పుడీ శివానందంగారే ఇ. ఇ గారితో చెప్పి వర్క్ఇన్‌స్పెక్టరుద్యోగం వేయిస్తారు!"

అయిదవ రాయి పెయింట్ చేస్తూ తన్లో తనే నవ్వుకున్నాడు తిరపతి. "ఇప్పుడు రాళ్ళ పెయింట్ చేస్తున్న తను...."

"ఇంకో ఐదేళ్ళలో వర్క్ఇన్‌స్పెక్టరు!" అప్పుడెంత ఆనందంగా ఉంటుంది! జీతంలోంచి నెలకో వందయినా దాచుకోవచ్చు. అలా ఓ మూడేళ్ళు డబ్బు దాచుకుని. ఇంజినీరింగు కాలేజీలో చేరితే.... మరో మూడేళ్ళలో తను, ఇంజినీర్!"

* * *

శివానందం, అసిస్టెంటు ఇంజినీరు తిరపతికేసి కాస్త ఇదిగా చూశారు. తిరపతి కుర్చీలోంచి లేచి తనే ముందర నమస్కారం చేసి ఆయనకి కుర్చీ చూపాడు.

"ఇప్పుడు నువ్వు ఇంజినీరువి, నేను కేవలం కంట్రాక్టర్ని నువ్వు సంతకం పెట్టందే నా బిల్లులు కదలవు. సిఫారసు చెయ్యందే పాసవ్వవు. ఈ పదేళ్ళలో నీ చరిత్ర చాలా మారిందోయ్!" తృప్తిగా నవ్వుతుంటూ అన్నాడు శివానందం.

తిరపతి చిరునవ్వుతో అన్నాడు — "ఎంత అభివృద్ధి సాధించినా దానికి మూలం మీరని మర్చిపోను సార్. మీరు చేసిన సహాయానికి ప్రతిగా మీ దగ్గర ప్రతిఫలం ఆశించకుండా. మిమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా మీ బిల్స్ పాస్ చేస్తాను. అలా ఐనా మీ ఋణం తీర్చుకుంటాను."

అతని వినయం, కృతజ్ఞత చూసి శివానందం చాలా సంతోషించాడు. పదేళ్ళ

ఉచితం !! **ముత్యాల సరాలు** FREE!!

# మాయ స్తంభాలు

సర్ క్రిస్టఫర్ రెన్ ఇంగ్లాండు దేశంలో పేరు ప్రఖ్యాతి గాంచిన గొప్పశిల్పి. అతడు ఒక గొప్పదేవాలయము యొక్క బురుజును నిర్మించుటకు ఎన్నుకోబడ్డాడు. ఆ కలషం ఎంతో అద్వితీయమైనది. అటువంటి పనితనము మరెక్కడా కనిపించదు. అందువలన అతని సహోద్యోగులు అతనియందు అసూయచెంది. అతని పనితనాన్ని విమర్శిస్తూ. అందులోని లోపాలను ఎంచుతూ. పెద్ద అల్లరి లేవదీస్తుండగ అక్కడ అధికారులు కలుగచేసుకొని, ఆ కలషం కూలిపడిపోకుండ. దానికి ఆధారంగ ఉండుటకు రెండు పెద్దస్తంభాలనుకూడా నిర్మించమని శిల్పికి ఆజ్ఞాపించారు. శిల్పి తనకు శిల్పవిద్యలోనున్న పరిజ్ఞానాన్ని, తన పనితనపుయొక్క పటుత్వాన్ని వివరించి చెప్పి, ఈ బురుజుకు ఆసరంగ, ఆధార స్తంభాలు కట్టడం అనవసరం అని ఎంతగ వాదించిన అతని విరోధులు అనేకులున్నందువలన. ఆ స్తంభాలు నిర్మింపక తప్పలేదు.

కాలవాహినిలో ఒక యాభై సంవత్సరాలు దొర్లిపోయాయి. బురుజుకు తిరిగి రంగులు వేయవలసిన అవసరం ఏర్పడింది. పనివారు పైకివెళ్ళి చూచినప్పుడు, ఆ ఆధార స్తంభాలకు. బురుజునకు మధ్య రెండడుగుల స్థలం ఖాళీగా ఉంది. అంటే ఆ మాయ స్తంభాలు బురుజుకు ఆధారంగ లేనేలేవు. కేవలం అలంకారప్రాయంగ కలషాన్ని అంటకుండా వట్టిగానే నిలబడియున్నాయి. తన శిల్పవిద్యలో సంపూర్ణవిశ్వాసం కలిగిన ఆ శిల్పి అధికారుల సంతృప్తి కోసం ఈ మాయస్తంభాలను నిర్మించాడుగాని అవి ఏమాత్రం ఆధారంగాలేవు. అధికారులు, చూపరులు ఇవి ఆధారస్తంభాలని తలంచి మోసపొయ్యారు.

లార్డ్ బైరన్ ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన కవి. రాజాధిరాజుల ఆస్థానములో నివసించే అందమైన అతివలకుకూడా ఆరాధ్యదైవం. వారందరిని తన సమయోచితమైన కవిత్వముతో మత్తెక్కిస్తూ, వారి మనస్సును దోచుకుంటూ వారి మన్ననను అందుకొంటూ వారి మైత్రిలో, ఆడుతూ పాడుతూ, తింటూ త్రాగుతూ, జీవితములో తనకున్న బాధ్యతలన్నీ విస్మరించి, జీవితం అంటే "తిని త్రాగి ఆనందించుటయే తప్ప మరేద కాదనే" భావం ఇతరులకు కలుగజేసాడు.

అతడు తన ముప్ఫై ఆరవ సంవత్సరంలోనే మరణించాడు. తన చివరి జన్మదినమున ఈ మాటలు పలికాడు. "నా జీవితంలోని మాధుర్యం అందించే పుష్పాలు అన్నీ రాలిపోయాయి. వేదనలు, కుళ్ళు మాత్రం నాకోసం మిగిలిపోయాయి." అతడాశ్రయించిన స్తంభాలుకూడా మాయ సంభాలు. తనకాధారం కావాలని కోరుకునే సమయంలో అవి అతన్ని ఆదరించలేకపోయాయి. దేవుని యెడల ధనవంతులుకాకుండ. వారి సంతృప్తి కోసమే తినుచు, త్రాగుచు, సంతోషించేవారితో క్రీస్తు ఇలా గన్నాడు "వెర్రివాడ! ఈ రాత్రినే ప్రాణమును అడుగుచున్నారు. నీవు సిద్ధపరచినవి ఎవనివగును?" యౌవనుడా! నీవు ఈనాడు మరణిస్తే. ఆ మరణాన్ని ఎదుర్కొనుటకు సిద్ధముగనున్నావా?

—చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం ఉచితం ఉచితం

మీకు బైబిల్‌కు సంబంధించిన ఉచితంగా లభించే అందమైన పుస్తకాలు కావాలంటే, ఒక పోస్టు కార్డు మీద మీ అడ్రసు స్పష్టంగావ్రాసి మాకు పంపండి. పోస్టు ఖర్చులు కూడా మేమే భరించి ఉచితంగా పుస్తకం పంపుతాము.

Hope

ఎస్. జాన్ డేవిడ్,
నిరీక్షణ,
పోస్టుబాక్సు : 12,
చిలకలూరిపేట,
గుంటూరు జిల్లా (A. P.)
A. M. G.

Gospal Message inserted by Mr. S. John David for A. M. G. Through Hope Advertising.

క్రితం "పనిప్పించమంటూ" ఆత్మాభిమానంతో అర్థించిన తిరపతి అతని కళ్ళముందు మెదిలాడు.

* * *

పదిహేనవ రాయికి రంగు వేస్తూ తిరపతి మనస్ఫూర్తిగా శివానందం ఋణం తీర్చుకోవాలనుకున్నాడు. తను ఇంజినీరయ్యాక "ఆయన్ని మర్చిపోకూడదు."

"అందరు ఇంజినీర్లలాగా లంచాలు తీసుకోకూడదు. తిరపతి అంటే నిజాయితీకి మారుపేరని అందరికీ తెలియాలి."

తిరపతి ఆలోచన్లు రాళ్ళతోపాటే ఇంకా ఇంకా ముందుకి.... కొండ మీదికి ఎక్కాయి.

* * *

పాతిక సంవత్సరాలు ఇట్టే కరిగిపొయ్యాయి. ఇప్పుడు కారు, బంగళా, అందమైన భార్య. కాలేజీలో చదువుతున్న పిల్లలు.... అన్ని హంగులూ ఉన్నాయి.

చీఫ్ ఇంజినీరు తిరపతి అంటే సబార్డినేట్స్ అందరికీ హడల్. అవినీతి పేరు వింటే చండ ప్రచండ రూపం దాలుస్తాడు. తన దగ్గరకి పని చూపించమని వచ్చిన పేదవారందరికీ ప్రతిఫలం ఆశించకుండా ఏదో ఒక మార్గం చూపిస్తాడు.

ఈ పాతిక సంవత్సరాల్లో చాలా మార్పులు వచ్చాయి. జనాభా చాలా పెరిగిపోయింది. భక్తులని తిరుపతినుంచి తిరుమల తీసుకెళ్ళడానికి రెండురోడ్లు చాలట్లేదు. దేవస్థానం మూడో రోడ్డు నిర్మించదల్చింది.

చీఫ్ ఇంజినీర్ తిరపతే మూడోరోడ్డుకి ప్లాన్ గీశాడు. రోడ్డు నిర్మాణం చాలా చురుగ్గాసాగింది. తిరపతికి రాష్ట్రంలోవున్న మిగిలిన అన్ని పనులకంటె ఆ రోడ్డుమీదే ఎంతో శ్రద్ధ. వారానికొకసారైనా తిరుపతి వచ్చేవాడు. ఆ పనిలో ఎలాంటి జాప్యం, అవకతవకలు సహించడు.

రోడ్డు నిర్మాణం పూర్తైంది. ప్రధాన మంత్రిగారు ప్రారంభోత్సవం చేశారు. ప్రధాన మంత్రిగారి కారువెనక మిగిలిన కార్లతోబాటు చీఫ్ ఇంజినీరు కారూ సాగిపోయింది.

రోడ్డుమీద ఆఖరునున్న మైలు రాయి చూసి చీఫ్ ఇంజినీరు తిరపతి నవ్వుకున్నాడు. ఆ రాయి ఎవరో మామూలు కూలీ పెయింట్ చేశాడు. ఏ ప్రత్యేకతా లేకుండా అన్ని రోడ్ల మీదా ఉండే మైలు రాళ్ళల్లాగే వుంది.

రెండవరోడ్డులో తను పెయింట్ చేసిన రాళ్ళల్లా కళాఖండంలా లేదు. తనలో ఓ ప్రత్యేకత వుంది. అందుకే ఒకో

రాయిని పెయింట్ చెస్తూ కిందనుంచి పైకి కొండఎక్కి నట్లే.... జీవితంలోకూడా ఎన్ ఎమ్. ఆర్. కూలీ పని నుంచి ఒక్కో మెట్టే ఎక్కి ఈనాడు చీఫ్ ఇంజనీర్ అయ్యాడు.

*　　*　　*

అలా ఊహాలోకంలో ఆశలశిఖరాలందు కుంటూ కొండ పూర్తిగా ఎక్కి ఆఖరు మైలురాయి పెయింట్ చేసున్నాడు తిరపతి, కంటున్న కలల తాలూకు నిషా పూర్తిగా కరిగిపోగా, ఆఖరు మైలురాయిమీద "21 మైళ్ళు" అని వ్రాశాడు.

రాత్రి పది గంటలయింది. అనంతమైన ఆకాశంలో అసంఖ్యాకమైన వజ్రాలూ, వైఢూర్యాలూ పొదిగినట్లు మెరుస్తున్నాయి నక్షత్రాలు.

పని పూర్తయింది. శరీరం పూర్తిగా అలిసిపోయింది. తృప్తిగా ఆఖరు రాయి కేసి చూశాడు. మళ్ళీ ఆకాశంలోకి చూశాడు. తన స్వప్నాలన్నీ నిజమవ్వాలి. జీవితంలో పైకెళ్ళాలి. కూలీగానే ఉండి పోకూడదు. చీఫ్ ఇంజనీరవ లేకపోయినా కనీసం అసిస్టెంటు ఇంజనీరన్నా అవ్వాలి. మూడవ రోడ్డంటూ నిర్మిస్తే అది తనే నిర్మించాలి.

అలసిన శరీరంతో, సంతృప్తి, ఆనందాలతో మనస్సు నిండగా ఒక్కడే. దగ్గరగా ఉన్న ఒక ఖాళీ కాటేజి వరండాలో చలికి ముడుచుకు పడుకున్నాడు తిరపతి. తిరిగి ఆ తియ్యటి కలలు నెమరువేసుకుంటూ.

*　　*　　*

క్రింద....

తిరుపతిలో.... ఘాట్ రోడ్ మొదట్లో.. ప్రారంభోత్సవాని కన్నీ సన్నాహాలూ పూర్తయ్యాయి. కోటిపల్లెలో మహాశివ రాత్రి తీర్థంలా చాలా కోలాహలంగావుంది. ఫొటోగ్రాఫర్లు, విలేకర్లు, ఇంజనీర్లూ అటూ, ఇటూ తిరుగుతున్నారు. అన్నీ


ఆంధ్రజ్యోతి పాఠకులకు అపూర్వ అవకాశం! త్వరపడండి!



అక్షరమాల...... [సినీపజిల్]
మండపేట... తూ. గో. జిల్లా. (A.P)
రూ. 35,000 లు గెలవండి
ఆల్ కరెక్టుకు రూ. 20,000 లు
1,2,3,4. తప్పులకు రూ. 15,000 లు

● ముగింపు తేదీ : 20-4-76　　ఫలితాలు : 25-4-76　　ఆంధ్రజ్యోతి డైలీలో

● ఎంట్రీ ఫీజు : 1 ఎంట్రీ రూ. 2/-; 10 ఎంట్రీలు రూ. 5/-; 25 ఎంట్రీలు రూ. 10/-.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | | శ్రీ | | |
| 2 | జ | య | | | |
| 3 | | | ల | | |
| 4 | | భ | | | |
| 5 | | | తి | | |
| 6 | జ | య | | | |
| 7 | | | నా | థ్ | |
| 8 | రా | జ | | | |
| 9 | | | య్య | | |
| 10 | | | రా | జ | |
| 11 | | | బా | బు | |
| 12 | | | రా | వు | |

పోటీలో పాల్గొనుటకు మీరు పాటించవలసిన ముఖ్య షరతులు :—

* ప్రక్క గడులలో తెలుగు సినీ నటీనటుల పేర్లు [1 నుండి 6 వరకు సినీ తారల పేర్లు; 7 నుండి 12 వరకు సినీనటుల పేర్లు] అసంపూర్తిగా ఇవ్వబడినవి. ● మీరు ఊహించిన ఆ నటీనటుల పేర్లను వరుసగా తెల్లకాగితముపై వ్రాసి పంపండి. ● ఎంట్రీ ఫీజు మనియార్డరు ద్వారా మాత్రమే పంపాలి. ● తమ ఎంట్రీలలో మనియార్డరు కట్టిన M. O. రశీదు తప్పక జతపర్చి పంపాలి. ఎంట్రీలకు తగ్గ ఎంట్రీ ఫీజు చెల్లింపని, మనియార్డరు కట్టిన రశీదు జతపర్చని, తుడుపులు కొట్టివేతలుగల, ముగింపు తేదీ తర్వాత వచ్చునట్టి ఎంట్రీలు పోటీకి ఎంతమాత్రమూ పరిశీలించబడవు. [ముఖ్యంగా ఈ విషయాల్ని పోటీదారులు మరువరాదు.] ● తెల్ల కాగితముపై ఒకరు ఎన్ని [వందలు, వేలు] ఎంట్రీలైనా వ్రాసి పంపవచ్చును. ఒకరే ఎన్ని బహుమతులైనా పొందవచ్చును. ● ఈ పజిల్ తాలూకు కీ సొల్యూషన్ ప్రచురణకు ముందుగానే స్టేట్ బ్యాంకు లాకర్సులో సీలు చేయబడినది. అట్టి కీ సొల్యూషన్ లో సరిపోలని ప్రతీ మాటా ఒక తప్పుగా లెక్కించబడును. ఆల్ కరెక్టు ఎవ్వరూ లేనిచో దగ్గర తప్పులవారికి ఆ బహుమతి అట్లే ఇతర బహుమతులు పంచబడును. ● ఒకరి కంటె ఎక్కువమంది విజేతలున్న బహుమతుల మొత్తం సమంగా పంచబడును. ● తమ ఎంట్రీలలో 50 పైసలు పోస్టు స్టాంపులు పంపిన వారికి మాత్రమే విజేతల లిస్టు, తదుపరి పోటీ ఎంట్రీలు పంపబడును. ● మీ ఎంట్రీలు, మనియార్డర్లు ఈ దిగువ అడ్రసుకే పంపండి.

M/s AKSHARAMALA, MANDAPETA-533 308, E. G. Dt., (A.P.)

● అక్షరమాల [సాహిత్య లహరి] పోటీ నెం-2 యొక్క ముగింపు తేదీ పోటీదారుల కోరికపై ది. 16-3-76 నుండి ది. 20-4-76 వరకు పొడిగించడమైనది. ఫలితాలు 25-4-76 ఆంధ్రజ్యోతి డైలీ వర్గీకృత ప్రకటనల్లో చూడండి.

## సుభాషితాలు

కొంతమందికి సాహిత్యపు దురద పుడుతుంది. ఇక ఆ దురద మాన్పాలంటే మన శక్యంకాదు. అందుకే వాళ్ళు అస్తమానమూ కలంతో గోక్కుంటూ కూర్చుంటారు.

—సామ్యేల్ లోపర్

• • *

ఏ కళాకారుడైనాసరే తన కళను డబ్బుకు అమ్ముకోవడం మొదలెట్టాడో, ఇక అతని కళ కళాగుణాన్ని కోల్పోతుంది.

—సామ్యేల్ బట్లర్

• • *

తోడేలుపిల్ల పుట్టినవుడు చాలా వికృతంగా వుంటుందట. తల్లి దాన్ని నాకినాకి ఓ ఆకారానికి తెస్తుందట. అలాగే రచయితకూడా తన రచనకు మెరుగులు దిద్దుతూండాలి.

రచయితకు తనశక్తిమీదనమ్మకముండాలి. అంటే అహంభావమని అర్థంకాదు.

—అలెగ్జాండర్ పోప్

• * *

ఆటగాడు కావాలనుకుంటే ఆడుతూవుండాలి పాటగాడు కావాలనుకుంటే పాడుతూవుండాలి అలాగే రచయిత కావాలనుకుంటే వ్రాస్తూ వుండాలి.

—ఎపికేటస్

• • *

ఏగతి రచియించిరయేని సమకాలము వారలు మెచ్చరేగదా!

—చేమకూర వేంకటకవి

* * *

చిన్న దుఃఖాలెప్పుడూ ఎక్కువ అల్లరిపెడతాయి. కాని గొప్పదుఃఖాలు మనిషిని మూగవాడిని చేస్తాయి.

—సెనేకా

• • *

ఎవరి ప్రభావమైతే నీపై పడలేదని భావిస్తావో వారే కొన్ని సమయాలలో నీపై తమ గాఢ ప్రభావాన్ని చూపించగలిగే అవకాశముంది.

—విన్‌స్టన్ చర్చిల్

• • *

కళాఖండాలను పురుషుడు సృష్టిస్తాడు. కాని పురుషులనే స్త్రీలు సృష్టిస్తారు.

—రోమారోలా

సేకరణ: పి. గోపాలకృష్ణమూర్తి

సరిగ్గా వున్నాయోలేవో చూస్తున్నారు.

ఇంతలో విమానం లాంటి కార్లో మంత్రిగారొచ్చారు. పుష్పమాలాలంకృతులైన తర్వాత రిబ్బను కత్తిరించారు.

రోడ్డుమీద ముందు మంత్రిగారి కారూ, దానివెనక మిగిలిన కార్లూ కదిలాయి.

మంత్రిగారు తిరుమల గిరుల సౌందర్యాన్నాస్వాదించడంలేదు. రోడ్డు మీద వున్న మైలు రాళ్ళనసలు చూడనేలేదు.

రాబోయే ఎలక్షన్లలో కొత్త ప్రామిసులేం చెయ్యాలా అని ఆయన ఆలోచన. ఆ రోడ్డు వేసిన వాళ్ళకే ఆయన ఆలోచనల్లో స్థానంలేదు. ఇంక రోడ్డుమీది రాళ్ళకి రంగేసిన కూలీ కెక్కడుంటుంది స్థానం?

* * *

పైన....
తిరుమలలో....
ఆఖరు రాయివద్ద....

దేవస్థానం సిబ్బంది, మంత్రిగార్ని చూడ్డానికి వచ్చిన జనం పెద్ద గుంపుకూడి ఉన్నారు. వాళ్ళల్లో వెనగ్గా తిరపతి ఉన్నాడు. వాళ్ళని తోసుకు ముందుకి రావాలనుందతనికి. కానీ ఆలోచనల్లోనే కానీ ఆచరణలో చొరవ లేదతనికి. అలా అందరికీ వెనగ్గానే వుండిపొయ్యాడు.... ముందరకెళ్ళలేని తన చేతకానితనాన్ని తిట్టుకుంటూ........

కార్లన్నీ అక్కడికి చేరుకున్నాయి. మంత్రిగారు పూల దండలూ, నమస్కారాలు అందుకుంటూ పరాకుగా ఆ రాయికేసి చూశారు. కొద్ది ఆశ్చర్యంతో ఆ రాయిమీద వ్రాసిన "21 మైళ్ళు" అన్న పదాన్ని జాగ్రత్తగా చూశారు. చీఫ్ ఇంజినీరు గారుకేసి తిరిగారు.

"ఘాట్ రోడ్ పొడుగెంత?"

"ట్వెంటీవన్ కె. ఎమ్."

"మరిక్కడ '21 మైళ్లు' అని వుందే! ఇలా తప్పు ఎందుకు వ్రాశారు?"

చీఫ్ ఇంజినీరుగారు ఆశ్చర్యపోయి ఆ రాయివంక చూశారు. నిజమే '21 మైళ్లు' అని వుంది. ఇంత పొరపాటు ఎలా జరిగింది? యస్. ఇ. గారికేసి ప్రశ్నార్థకంగా చూశారు.

యస్. యీ గారు విస్తుబోయి ఆ రాయికేసి చూసి ఇ. ఇ. గారికేసి కాస్త కోపంగా చూశారు.

ఇ. ఇ. గారు తల తడుముకున్నారు. ఎ. యి. గారితో "ఏం పనండీ ఇదీ ?" అన్నారు.

ఎ. యి. గారు తెల్లబోయారు "ఎవరి పనిది?" ఆయన దృష్టి శివానందం మీద పడింది.

"ఏమిటండీ ఇది? ఇది నాకెంత అవమానం? ఈ ఒక్క విషయం నేను తనిఖీ చెయ్యకపోతే ఇలా చెయ్యాలా? కిలోమీటరు కొకరాయి పాతించి వాటిమీద మైళ్ళని రాయించడమేమిటి? ఇంత అజాగ్రత్తా? మంత్రిగారుచూస్తేగాని ఎవ్వరూ గమనించలేదంటే ఎంత అవమానం?"

శివానందం మొహం చిన్నబోయింది. మంత్రిగారూ, పరివేష్టితబృందం ముందుకు సాగిపోయారు. శివానందం మట్టుకు రాయికేసి ఆలోచనగా చూస్తూ అక్కడే నిలబడ్డాడు.

దూరంగా నిల్చున్న తిరపతి మంత్రిగారు ఇంజినీర్లతో రాయికేసి చూసి మాట్లాడడం చూశాడు. ఏ. యి. గారు శివానందంతో మాట్లాడడం కూడా చూశాడు."

"మంత్రిగారు ఆ రాయికి అందంగా రంగు వెయ్యడాన్ని మెచ్చుకున్నారు. ఇంజినీర్లు కూడా మెచ్చుకున్నారు. కానీ శివానందం మట్టుకు తన గూర్చి వాళ్ళకేమి చెప్పలేదు." అదీ అతని ఆలోచన.

తిరపతికి శివానందం మీద పీకెలదాకా కోపం వచ్చింది. ఏం? మంత్రిగారితో ఆ పని తనే చేశానని చెప్తే అతని సొమ్మేం పోయింది? ఐనా ఈ డబ్బున్న వాళ్ళంతా ఇంతే; పొగడ్తలన్నీ వాళ్ళకీను, తెగడ్తలన్నీ కూలివాళ్ళకీ అనుకుంటాడు.

తిరపతి ఆత్రుతగా ఒక్కపరుగున శివానందాన్ని సమీపించాడు. ఎంతో ఆశగా అతని మొహంలోకి చూశాడు.

శివానందానికి తిరపతిని చూడగానే కోపంతో ఒళ్ళు తెలీలేదు. బాగా దగ్గరికి రానిచ్చి ఈడ్చిపెట్టి లెంపకాయ కొట్టాడు.

పాపం!

తిరపతి స్తంభించిపోయాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే చెంపపట్టుకు నిలబడిపోయాడు.

"బుదిలేని గాడిదా!" జాగ్రత్తగా పని చెయ్యరా అంటే నువ్వు చేసిన నిర్వాకం ఇదా! మైళ్ళని రాయమని ఎవడ్రా చెప్పింది నీకు? మైళ్ళుపోయి కిలోమీటర్లు వాడుకలో కొచ్చి ఎన్నాళ్ళయింది? ఫిఫ్త్ ఫారం చదివేడిశావు పైగా .... .... చదువురాని కూలీ మాత్రం చెయ్యలేకపొయ్యావ్.

"ఊ.... అలా దేభ్యం మొహం వేసుకు చూడకు ఆ "మైళ్లు" తుడిచి "కిలో మీటర్లు" అని వ్రాసుకుంటూ పైనుంచి కిందికిపో!"

★